# ఫ్రీ టికెట్

ప్రతాప చంద్ర ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానంలో ప్రయాణించడం అది మొదటి సారేంకాదు. బి.కాం అయ్యాక యం.బి.ఎ డిగ్రీ కూడా తీసుకున్న అతనికి ఇప్పుడు ఇరవైయ్యయిదు సంవత్సరాలు కూడాదాటాయి. ఇప్పటి దాకా అతను ఓ ఇరవైయ్యయిదు ఇంటర్వ్యూల కయినా హాజరయి ఉంటాడు. వాటికోసం అతను ఢిల్లీ, కలకత్తా, బోంబాయి, మద్రాసు లాంటి మహానగరాలకు చాలాసార్లు అర్థలాభయాత్ర చేశాడు. అయితే అవన్నీ అనర్థయాత్ర లయ్యాయేమోనని అప్పుడప్పుడూ అతననుకుంటూ ఉండేవాడు. కాస్తో కూస్తో స్థోమత ఉన్న తల్లిదండ్రుల ఏకైక సంతానం కాబట్టి అర్జంటుగా ఏ ఇంటర్వ్యూ కయినా వెళ్ళాలంటే విమానంలో వెళ్లడానికి కూడా అతని తండ్రి అనుమతించేవాడు. ఈ ఇంటర్వ్యూల వ్యవహారానికే దాదాపుగా ఓ లక్షపైనే ఖర్చయి ఉంటుంది.

ఒక యువకునికి కావలసిన లక్షణాలన్నీ అతనికి ఉన్నాయని చెప్ప వచ్చు. ఆయన అమితాబ్ బచ్చన్ అంతటి ఎత్తరి కాక పోయినా, సాధారణంగా కన్నె పిల్లలు కోరుకునేంత పొడగిరి - అయిదడుగుల పది అంగుళాల ఎత్తు, ఆడపిల్లలు తాము పొట్టివాళ్ళయినా పొడుగ్గా ఉండే అబ్బాయిలనే కోరు కుంటారు. తమ సంతానానికి తమలోపం రాకూడదని అనుకోవడంలో తప్పులేదు కదా! ప్రతాప్‌చంద్ర, గుల్షన్ బావరాలాగా మరీ సన్నం కాదు, అలాగని మెహమూద్, షమ్మీ కపూర్‌ల లాగ మరీ లావుకాదు. చక్కని శరీరాకృతి. ఆమీర్‌ఖాన్ వంటి రంగు లేకపోయినా, చిరంజీవి, రజనీ కాంత్‌ల లాగా రంగు తక్కువవాడేమీకాదు. మంచి పురుష లక్షణాన్ని ప్రకాశింప చేసే మరీ వెడల్పు, మరీ

సన్నంకాని ఒకమీసకట్టు అతని అధరోపరిక్షేత్రాన్ని అలంకరించి ఉంది. గోవిందా, మిధున్ చక్రవర్తి ల మాదిరి బట్టతల లాంటి నున్నని ఛాతీ కాదు అతనిది. అయితే సతీష్‌షాలాగా మరీ ఎలుగు బంటి లాంటిదీ కాదు. ప్రతాప చంద్రుడి శరీర వర్ణన ఇంతటితో ఆపితేనే మంచిది.

అయితే అతని స్వభావ వర్ణన మొదలు పెడదాం. ఇంతటి శరీర సౌష్టవం ఉన్న అతని స్వరం లతామంగేష్కర్, ఉషా ఊతుప్‌ల స్వరాలకి మధ్య స్థంగా ఉంటుందని చెప్తే అందులో పెద్ద అతిశయోక్తి ఏం లేదు. అటువంటి గొంతుకు ఆయన హక్కుదారుడే, ఎందుకంటే అతనిలోని బిడియం, ఆత్మవిశ్వాసంలో ఉత్తీర్ణత పొందని మనోదౌర్బల్యం. ఆ ప్రతాప - చంద్రుడిలోని మచ్చలు. అందువల్లనే ఆయన ఎన్ని ఇంటర్వ్యూలకు వెళ్ళినా అతనికి సెలెక్షన్ రాలేదు.

ఒకవేళ ఒకటో రెండో ఇంటర్వ్యూల తరవాత ఉద్యోగానికి అతను సెలెక్ట్ అయినా ఏదోకారాణాలు చెప్పి ఆ ఉద్యోగంలో చేరడు. అతని అభిప్రాయం తప్పని చెప్పలేం. ఎందుకంటే ఈ కాలంలో రెండువేలు ఇచ్చే ఉద్యోగం ధొరికినా ఆ డబ్బుతో బొంబే, కలకత్తాలాంటి నగరాలలో బ్రతకడం కష్టమే, ప్రతాప చంద్ర లాంటి ఏకైక సంతానానికి అది అసలు వీలుకాదు.

ఫుట్‌బాల్, క్రికెట్, ఎథ్‌లెటిక్స్‌లో బహుమతులు సంపాదించిన ప్రతాప చంద్రుని శారీరక శక్తి సామర్థ్యాల గురించి అనుమానించ నవసరం లేదు. కానీ ధైర్యం విషయంలో అంతముందంజ లేదు. అయితే అతనొక పిరికివాడని కొట్టి పారవేయకూడదు. ఇంగ్లీషులో టిమిడ్ అనే పదం అతని స్వభావానికి చక్కగా సరిపోతుంది. ఆరకంగా తన ఆకారం, స్వభావం ఏమయినా ఇప్పుడు మనహీరో హైదరాబాద్ నుంచి బొంబాయికి వెళ్ళే విమానంలో సుఖంగా కూర్చున్నాడు. స్వతహాగా భయస్థుడయినా అందమైన అమ్మాయిలు కనిపిస్తే నిలబడి అయినా కూర్చుని అయినా చూడడం అతనికి హాబీ. అంటే ఒక అందగత్తెను చూస్తూ పడుకోవడం అతనికి ఇష్ట లేదని కాదు. కా నీ తనకు అందమైన పిల్లతోపెళ్ళి కావాలంటే ముందు తన సొంతకాళ్ళమీద నిలబడాలికదా!

ఉదయం వెళ్తున్న ఆవిమానంలో స్నానంచేసిగాని, చెయ్యకుండా గాని అందంగా అలకరించుకుని, అవసరమయితే స్ప్రే లుకూడ చల్లుకుని వచ్చే ఎయిర్ హోస్టెస్‌లలో అత్యంత సుందరమయిన అమ్మాయి చాకలెట్లు తీసుకుని దగ్గరకు వచ్చింది. కొంచెం సిగ్గుతో రెండు చాకెలెట్లు తీసుకుని, ఆమె'సుస్మితాసేన్'వదనాన్ని అరగంట వీక్షిస్తూ 'థాంక్యూ' అని అన్నాడు. 'యుఆర్ వెల్‌కం' అని ఆమెకూడ చిరునవ్వుతో బదులిచ్చింది. ఆమెలో

ఏదో ప్రత్యేకత ఉందని అతనికి అనిపించింది. ప్రథమ వీక్షణంలో ఆమెమీద తనకు ప్రేమ పుట్టిందా అని కూడ సందేహం కలిగింది. కానీ తనలాంటి ఎంతో మంది యువకుల్ని ఆమెరోజూ చూస్తుంటుందేమో. అయినా తనలాంటి నిరుద్యోగికి అలాంటి ఛాన్స్ దొరుకుతుందా అని నిరాశపడబోయి. నిట్టూర్పు విడుద్దామా అన్న సంకోచంలో పడి, ఫర్‌ది టైం బీయింగ్ ఆకార్యక్రమాన్ని వాయిదా వేద్దామని నిశ్చయించుకున్నాడు. తరవాత ఆ మనోహరి అటు ఇటు మందగమనం చేస్తుంటే అతను సుఖంగా చూస్తూకూర్చున్నాడు. ఒక్కొక్క నిమిషం గడుస్తున్న కొద్దీ ఆమె మీద అభినివేశం ఎక్కువయింది. ఆరకమైన దివాస్వప్నలోకంలో అతను విహరిస్తున్న సమయంలో ఆ అతిఘోరమైన సంఘటన జరిగింది.

ఆసుందరి మనోహర మందహాసంతో తనకు కాఫీ పోసి ఇచ్చింతర్వాత తన ముందుసీటులో కూర్చున్న ఒక పెద్ద కంపెనీ ఎగ్జిక్యూటివ్ లాంటి ముప్ఫయ్, ముప్ఫయ్యయిదేళ్ళ వయస్సున్న వ్యక్తి దగ్గరకు వెళ్లేటప్పుడు బుద్ధిలేని ఒక వెధవ ఆమెను తోసుకుంటూను ముందుకు పోవడం వల్ల ఆమె చేలితో ఉన్న కాఫీపాట్‌నుంచి కొంచెం వేడికాఫీ ఆ ఎగ్జిక్యూటివ్ వేసుకున్న క్రీమ్‌కలర్ కోటు మీద పడింది. ఆ కాఫీవేడి ఒంటికి తగలడం వల్లనో లేక తనకోటుకు సంభవించిన దురవస్థ వల్లనో అతనొక స్ప్రింగ్ లాగా ఎగిరి నిలబడి కాఫీ పడిన కోటు భాగాన్ని కర్‌ఛీఫ్‌తో దాన్ని తుడవడం మొదలు పెట్టాడు. తత్తరపాటుతో, దాదాపు ఏడుస్తున్నగొంతుతో ఆ ఎయిర్ హోస్టెస్ సారీసర్!' అని మళ్ళీ మళ్ళీ చెప్తుంటే కోపంతో మండిపోతున్న అతను యూ బ్లడీ బిచ్ యు హేవ్ డామ్డ్ మై కోట్' అని అరిచాడు.

ఆ ''బ్లడీ బిచ్' అనే పదాలు ప్రతాపచంద్ర మస్తిష్కాన్ని విద్యుద్ఘాతంలా తాకి ఒక్క నిమిషంపాటు మొద్దుబారేట్లు చేశాయి. మరుక్షణంలో అతని రక్తం ఉడికి పోయింది. ఒక్కపాటున ఎగిరి ముందున్న ఎగ్జిక్యూటివ్ కోట్ కాలర్ పట్టుకుని ఇంగ్లీషులో ఇలా అన్నాడు. ''యూ డర్టీ బ్రూట్! సేవాతత్పర అయిన ఒక స్త్రీ గురించి ఇంత నీచమైన పదజాలం ఎలా ప్రయోగించగలిగావు? ఆమెకు క్షమాపణ చెప్పు ....ఊ! ........చెప్పు.'' ''హూఆర్ ది హెల్ ఆర్ యు టు ఇంటర్‌ఫియర్ ఇన్ దిస్ మాటర్.....? ఈజ్ షి యువర్ వైఫ్ ఆర్ సిస్టర్?'' అని అడుగుతూ వెనక్కు తిరిగి ప్రతాప చంద్రుని చేతిని కొట్టి తీసేశాడు.

అంతలో చుట్టూ కూర్చున్న నలుగైదుగురు ప్రయాణీకులు మరో ఇద్దరు ఎయిర్ హోస్టెస్‌లు పరుగెత్తివచ్చి వాళ్ళిద్దర్నీ యథా స్థానంలో కూర్చోబెట్టారు. ఒక ఎయిర్ హోస్టెస్ ఆ కోటు ఆసామికితుడవడానికి ఒక చిన్న టవల్ ఇచ్చింది. ఆ ఇద్దరమ్మాయిలు కూడ అతన్ని ఎక్స్‌క్యూజ్‌చెయ్యమని బ్రతిమాలారు. కొంచెం సేపటికి ఆ విమానం కెప్టెన్ కూడ

అక్కడికి వచ్చి అతనికి సారీ చెప్పాడు. తరవాత ''ఆ ఎయిర్ హోస్టెస్ కావాలని చెయ్యలేదుకదా! వెనక నుంచి ఎవరో పాసింజర్ తొయ్యడం వల్ల ఇలా జరిగింది. ఇట్ ఈజ్ ఎ ప్యూర్ యాక్సిడెంట్. దానికి ఆమెను చెడ్డమాటలతో తిట్టడం సమంజసం కాదని నా అభిప్రాయం. ఏమయినా జరిగిపోయిందిజరిగిపోయిందిలెటజ్ ఫర్‌గెటిట్.మీ ప్రవర్తన మా ప్రొఫెషనల్ రిస్కులలో ఒకటని మేం అనుకుంటాం. నేను మళ్ళీ ఒకసారి క్షమాపణ కోరుతున్నాను.'' అని అతను వెళ్ళిపోయాడు.

ఆ సమయంలో ఆ ఎయిర్ హోస్టెస్ ఆమె సీట్‌లోకి వెళ్ళికూర్చుని ముఖంమీద చేతులు కప్పుకుని వెక్కివెక్కి ఏడుస్తూనే ఉంది. మిగిలిన ఎయిర్ హోస్టెస్‌లు, కెప్టెన్ ఆమెను సముదాయించారు.

మరికొంతసేపటికి విమానం బొంబాయి ఎయిర్ పోర్ట్‌లో దిగింది. ఆ కోటేశ్వరావు లేచి ప్రతాపచంద్రను కోపంగా చూచి ముందుకు నడిచాడు. అయితే ప్రతాప చంద్రకు కూడ అతని మీద ఉన్న కోపం కొంచెం కూడ తగ్గలేదు. అతన్ని కైమాలాగా కొట్టాలని అనిపించింది కానీ విమానాశ్రయంలో తనకి తిరిగి దేహశుద్ధి అవుతుందేమో లేక తనని పోలీసువాళ్ళకు అప్పజెప్తారేమొనన్న భయంతో దాదాపు అందరూదిగాక అతను మెల్లగా విమానద్వారం దాకా వెళ్ళాడు.

ఆ తలుపు దగ్గర కొంచెం లోపలగా ఆ ఎయిర్‌హోస్టెస్ నిలబడి ఉంది. ప్రతాప చంద్రుని కోసం ఆమె నిరీక్షిస్తున్నట్లు అతనికి అర్థమయింది. అతను దగ్గరకు రాగానే దీనత్వంతో కూడిన చిరునవ్వుతో అంజలి ఘటించి. ''థాంక్యూ సర్! మీరు జోక్యం చేసుకోకపోతే నాకు మరింత దుఃఖం కలిగేది'' అని ఇంగ్లీషులో చెప్పింది.

ప్రతాప చంద్ర సంతోషంతో ఉక్కిరి బిక్కిరయ్యాడు. అతని జీవితంలో మొట్టమొదటిసారి ఒక అమ్మాయి... అదీ..ఇంత అందమైన అమ్మాయి తనతో కృతజ్ఞతా పూర్వకంగా మాట్లాడింది. అంతేకాక వెంటనే'' మీ అడ్రసిస్తారా'' అని అడిగింది.

ఎంతో సంతోషంతో ఆమె ఇచ్చిన కాగితం మీద, ఆమె ఇచ్చిన కలంతోనే తన ఇంటి అడ్రసు, టెలిఫోన్ నంబర్ రాసి ఇచ్చాడు. ఆమెతో ఏమయినా మాట్లాడాలి అని అతని మనస్సు తహతహ లాడిందికానీ, ఏం మాట్లాడాలో తెలియక ''మళ్ళీ కలుద్దాం... గుడ్‌బై'' అన్ని మెట్లు దిగాడు.

ట్రాన్స్‌పోర్ట్ ఎక్కే ముందు అతను ఒకసారి తిరిగి విమాన ద్వారం వైపు చూచాడు. ఆ వెనక చూపుకు ఎదురు చూస్తూ ఆమె అక్కడే నిలబడి ఉంది, అతని చూపు ఆమె చూపు మధ్యలో ఎక్కడో కలుసుకున్నాయి. అతను చెయ్యి ఊపుతూ బస్సెక్కాడు. బస్ టర్మినల్ బిల్డింగ్ వైపు కదిలింది.

దీని ఉత్తర పర్వాన్ని ఎక్కువ వివరించాల్సిన అవసరంలేదు.

ఆ అమ్మాయినుంచి అతనికి చాలా 'ఫార్మల్'గా ఉత్తరం వచ్చింది. అతను కూడ ఒక ఫార్మల్ జవాబు రాస్తూ ఒక అన్‌ఫార్మల్ కోరిక కూడ కలిపాడు - ఎంత తొందరగా వీలుంటే అంతతొందరగా ఆమెను కలవాలి అని. ఆమె కూడ హైదరాబాద్‌లో ఉండడం వల్ల దానికి తొందరగా జవాబు వస్తుందని ఆశించాడు.

ఆమె అడ్రస్ తెలియడం వల్ల ఆమె దగ్గరికి తాను పరుగెత్తి పోవచ్చు కదా! కానీ, దానికి కావలసిన చిల్లర ధైర్యం కూడ అతనికి లేదు. అయితే, ఆమె నుంచి జవాబే రాలేదు.

దానికి కారణం ?

తరవాత రోజే ఆమెనుంచి ఫోన్ కాల్ వచ్చింది అతన్ని ఇంటికి అహ్వానిస్తూ. తదనంతరం ఫోన్ కాల్స్, అండ్ హౌస్‌కాల్స్ వరసగా జరిగాయి. కానీ ఆమెను వివాహం చేసుకోవడానికి అతని తల్లిదండ్రులు అంగీకరించలేదు. తల్లిదండ్రులుకులం పేరుతో తన ప్రేమను చంపడానికి తాను సుతరామూ ఒప్పుకోడు. తత్ఫలితంగా వారి కల్యాణ మహోత్సవం చాలా వైభవంగా జరిగింది.

పెళ్ళితో ఈ కథ ముగించాల్నా ?

పాత అరవ సినిమాల ముగింపు ఇంతేకదా ?

కానీ మన హీరోకి ఉద్యోగం వచ్చిందా?

అతనిప్పుడు సుఖంగా బ్రతుకు తున్నాడా ?

అనుమానాలు ఎవరికయినా కలుగుతాయి.

ఆ అమ్మాయి అతనింటికి వచ్చిన రెండు మూడు రోజులకే అతని తల్లిదండ్రులకు డార్లింగ్ గా మారిపోయింది. అత్తాకోడళ్ళ మధ్య కురుక్షేత్రానికి వారికి అవకాశం దొరికేదే కాదు.

దానికి కోడలు ఇంట్లో ఉండాలి కదా! ఆమె డ్యూటీమీద ఎక్కువ రోజులు బైటికే వెళ్తుంటుంది. పాపం! ఆ కొత్త పెళ్ళి కొడుకుకు తన కొత్త వధువు కోసం ఎదురు చూస్తుండడం, హనీమూన్ అనుభవించడానికి బదులు దాన్ని గురించి పగటి కలలు కంటూ కూర్చోవడం ప్రధాన దిన చర్యగా మారిపోయింది.

మరి అతని ఉద్యోగం ఏమయినట్లు?

అది వచ్చినప్పుడే రానీ య్... తనకుదాన్ని గురించి తొందరేంలేదు. పైగా తనలో సగం

బాగా సంపాదిస్తుంది కదా! ఇంక తాను కూడ మొదలు పెడితే దాని ప్రయోజనం తమకిద్దరికీ లభ్యం కాదు. అప్పుడు ఎక్కువ సంతోషం పొందేది ప్రభుత్వమే. పాపం భార్యాభర్తలు కష్టపడి పనిచేస్తే వచ్చే సంపాదనలో సగం గవర్నమెంట్‌కే తిరిగి అప్పజెప్పాలికదా!

అలాగని తాను రోజూ కదలకుండ ఇంట్లోనే కూర్చోవాలా? అయితే మాత్రమేం? ఫరవాలేదు... తరవాత.. పిల్లలుపుడితే ఎవరో ఒకరు ఇంట్లో ఉండడం అవసరం. తాను బైటికి పోయి భార్య ఇంట్లో ఉండడమే మంచిదనుకోండి. అయితే... ఆమెకు వచ్చినట్లు అంతమంచి ఉద్యోగం తనకు దొరకడం అసాధ్యం.

ఇదంతా ఆలోచించి తలబద్దలు కొట్టుకోవడం ప్రతాప చంద్రుడికి ఇష్టంలేదు. అయితే ఇంటర్వ్యూలకు వెళ్ళడం మాత్రం మానలేదు. కానీ ముందున్నట్లుగ ఇప్పుడు టెన్షన్ మాత్రం లేదు.

తనకు నచ్చిన ఒక మంచి ఉద్యోగం ఎవరైనా ఇస్తేనే అతను చేరతాడు. దాన్ని గురించి ఇప్పుడు అతనికి ఏరకమైన ఆందోళన లేదు.

అయితే ప్రస్తుతానికి ప్రతాప చంద్ర తన హనీమూన్‌ను చిన్న చిన్న ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో కొంచెం కొంచెంగా పానం చేస్తూ రోమాంచం పొందుతున్నాడు. అంతేకాకుండ అతనికి చాలా సంతోషం కలిగిస్తున్న విషయం ఏమిటంటే ఏ ఇతర ఉద్యోగానికి లేని చాలా విశేషమైన సౌకర్యప్రదమైన ప్రివిలేజ్ తన ప్రస్తుత ఉద్యోగానికి అంటే భర్త ఉద్యోగానికి ఉండడం.

భార్యామణి ఎయిర్ హోస్టెస్. ఉద్యోగానికి ఒక ప్రత్యేక సౌకర్యంగా సంవత్సరానికి రెండుసార్లు భారతదేశంలో ఎక్కడికయినా ఆమెతో కలిసిగాని, విడిగా గాని ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానంలో తిరగ వచ్చంటే అది చిల్లర లాభమేం కాదు.

ఆ రకంగా ప్రతాప చంద్ర ప్రయాణం చేస్తున్నపుడు తానొక రాష్ట్రపతినో లేక ప్రధానమంత్రినో అనీ, ఆ విమానం తనకోసమే ఆకాశగమనం చేస్తుందనీ, విమానంలో ఉన్న ఇతరులందరూ తాను అనే ఆ వి వి ఐ పి కి ఉండే అనుచరగణమనీ అనుకుంటూ పులకించి పోయేవాడు.

కొంతకాలం క్రితం వరకుఎయిర్ హోస్టెస్‌లకు వివాహం చేసుకోకూడదన్న నిబంధన ఉండేది. రాక్షసీయమైన ఆ చట్టాన్ని తొలగించిన వాళ్ళు ఎవరైనా సరే... వాళ్ల కూతుళ్లకు, కూతుళ్ళ కూతుళ్ళకు ఎయిర్ హోస్టెస్‌గా ఉద్యోగం రావాలనీ, వాళ్ళకు తనలాంటి భర్తలు కట్నం లేకుండా, కులమత భేదం లేకుండా లభించాలనీ తనకు తెలిసిన దేవతల్నందరినీ ప్రార్థించడం తన కర్తవ్యమనీ ప్రతాప చంద్రుడనే ఫ్రీ టికెట్‌కు అనిపించింది. ★

( 12-10-95 నాటి ఆంధ్రభూమి సచిత్రవార పత్రికలో ప్రచురితం)